## హోటల్ మేనేజ్‌మెంట్ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని హోటల్ మేనేజ్మెంట్ కోర్సుల (బీహెచ్‌ఎంసీటీ, బీసీటీసీఏ) పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 8వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

## విద్యార్థుల వివరాలు పంపించాలని కళాశాలలకు ఆదేశం

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యార్థులకు అపార్ ఐడీ క్రియేట్ చేసేందుకు ఓయూ పరిధిలో అన్ని డిప్లొమా, యూజీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల వివరాలు పంపించాలని ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ అన్ని కళాశాలల యాజమాన్యాలను ఆదేశించారు. ఈ మేరకు ఆయా యాజమాన్యాలకు లేఖలను పంపించారు. నిర్దేశిత ఫార్మాట్లో ఆధార్ సంఖ్య, పేరు, పుట్టిన తేదీ, లింగము, మొబైల్ నంబర్, రోల్ నంబర్ తదితర వివరాలతో 2021-22 విద్యా సంవత్సరం నుంచి ప్రస్తుత విద్యా సంవత్సరం వరకు విద్యార్థులందరి వివరాలు ఈ నెల 9వ తేదీలోగా సమర్పించాలని ఆదేశించారు. లేనిపక్షంలో భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఈ ప్రక్రియను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి చేస్తోందని చెప్పారు. విదేశీ విద్యార్థుల వివరాలు అవసరం లేదని పేర్కొన్నారు.

## లఘు చిత్రాల ఉత్తమ దర్శకుడిగా వసంత్

అంబర్‌పేట, మే 5: లఘు చిత్రాల ఉత్తమ దర్శకుడిగా ఎంపికైన నగర కళాకారుడు రామడుగు వసంత్‌ను ఆనందలహరి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో డీడీకాలనీలో సత్కరించారు. టాలీవుడ్ క్రియేటివ్ డైరెక్టర్స్ అసోసియేషన్ జరిపిన పోటీల్లో టెన్ టైమ్స్ షార్ట్ ఫిలింకు దర్శకత్వం వహించిన రామడుగు వసంత్ ఉత్తమ దర్శకుడిగా ఎంపికయ్యారు. ఆనంద లహరి కన్వీనర్ కళారత్న రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

# పెండ్లికి చేయూత.. కేసీఆర్ ఘనతే


- ఆడబిడ్డల కుటుంబాలను ఆదుకున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు
- లబ్ధిదారులకు చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



లబ్ధిదారులకు ఆర్థిక సాయం చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్, మే 5: ఆడబిడ్డ పెండ్లికి ఆర్థిక సహాయం అందించిన మొట్టమొదటి రాష్ట్రం తెలంగాణ అని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో 38 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి 13, షాదీముబారక్ పథకంలలో 25 మందికి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడబిడ్డ పెండ్లి చేయడం కోసం పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆర్థికంగా పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.లక్ష 116ల చొప్పున సహాయం అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. అర్హులైన వారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలన్ లక్ష్మి, కుర్మ హేమలత, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, అత్తిలి మల్లికార్జున్‌గౌడ్, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కొలన్ బాల్‌రెడ్డి, వెంకటేషన్‌రాజు, బాలనగర్, సికింద్రాబాద్ తహసీల్దార్ కార్యాలయాల సిబ్బంది, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ నాయకుడు



గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, మే 5: అడిక్‌మెట్ డివిజన్ బీజేపీ నాయకుడు సురేందర్ బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయనకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇటీవల బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్ రాజీనామా చేసి బీజేపీ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ సమక్షంలో బీజేపీలో చేరారు. వారం రోజుల వ్యవధిలోనే బీజేపీ విధానాలు నచ్చక ఆయన తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరారు. సోమవారం ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జై సింహ సమక్షంలో సురేందర్ పార్టీ కండువా కప్పుకున్నారు. అనివార్య కారణాలవల్ల, కొంతమంది ఒత్తిడి వల్ల బీజేపీలో చేరానని సురేందర్ తెలిపారు. బీఆర్‌ఎస్ పుట్టిన ఇల్లు వంటిదని, భవిష్యత్తులో ఏ పార్టీలో చేరనని, బీఆర్‌ఎస్‌లోనే ఉంటానని సురేందర్ తెలిపారు.

# ఘనంగా సబితా ఇంద్రారెడ్డి, ఎర్రోళ్ల జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న విద్యార్థి నాయకులు




కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి జన్మదిన వేడుకలను ఓయూలో సోమవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో విద్యారంగ అభ్యున్నతికి ఆమె ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు మన ఊరు మన బడి వంటి పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. దీనిద్వారా పేదలకు సైతం నాణ్యమైన విద్యను అందించేందుకు వీలవుతుందని అభిప్రాయపడ్డారు. ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ఆమె జీవించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకురాలు సత్యక్క, బీఆర్‌ఎస్వీ నాయకులు నాగేందర్రావు, నిఖిల్, రాకేశ్, కాశీనాథ్, శరత్, శేఖర్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### ఓయూ ముద్దుబిడ్డ ఎర్రోళ్ల శ్రీనివాస్

ఓయూ ముద్దుబిడ్డ, తెలంగాణ రాష్ట్ర తొలి ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ జన్మదిన వేడుకలను ఓయూలో సోమవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి బొల్లు నాగరాజుయాదవ్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాడిన ఘనత ఎర్రోళ్లదని గుర్తుచేశారు. రాష్ట్ర తొలి ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా ఎంతో మంది దళితులు, గిరిజనుల సమస్యలు తీర్చారని కొనియాడారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిష్ఠించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ నాయకులు నాగారం ప్రశాంత్, నాగేందర్రావు కోదాటి, నిఖిల్ పటేల్, దేవాంశ్, ధీరజ్, లెనిన్, అంజి, శ్రవణ్, క్రాంతి, రవి, శ్రీకాంత్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## యువతను ముంచుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం



బాలెంల అవినాష్

ఉస్మానియా యూనివర్సిటీ: యువతకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు స్వయంగా వారిని నిండా ముంచుతోందని బీఆర్‌ఎస్వీ ఓయూ నాయకుడు బాలెంల అవినాష్ మండిపడ్డారు. అధికారంలో ఉండి యువతకు రాజీవ్ యువ వికాస పథకం ప్రారంభించి, దానికి రూ.6 వేల కోట్ల నిధులు కేటాయించి యువతకు ఉపాధి కల్పించేందుకు ఆర్థిక సహాయం అందజేస్తామని ప్రగల్భాలు పలికిన ప్రభుత్వ పెద్దలు నేడు మడమ తిప్పారని దుయ్యబట్టారు. బ్యాంకుల నుంచి రుణాల ద్వారా ఆర్థికసాయం అందిస్తామని చెప్పి, నేడు సిబిల్ స్కోర్ ఉంటేనే పథకానికి అర్హులని వారిని గందరగోళంలోకి నెట్టిందని ధ్వజమెత్తారు. ఆయా బ్యాంకులు దరఖాస్తుదారుల సిబిల్ ఆధారంగా రుణాలు ఇవ్వాలని తీసుకున్న నిర్ణయంతో ఎంతో మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈబీసీ నిరుద్యోగ యువతను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దరఖాస్తు ప్రక్రియ పూర్తికాకముందే యువత ఆశలు ఆవిరి చేశారని వాపోయారు. ఎన్నికల సమయంలో ఇస్తానన్న రెండు లక్షల ఉద్యోగాలు ఎటుపోయాయని ప్రశ్నించారు. నిరుద్యోగులకు ఇస్తానన్న భృతి ఏమైందని ఎద్దేవా చేశారు. విద్యార్థినులకు అందజేస్తామన్న స్కూటీ ఊసే లేకుండా పోయిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇలా మోసం చేస్తూ పోతే రానున్న రోజుల్లో విద్యార్థులు, నిరుద్యోగులు, ఆడబిడ్డలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. తప్పకుండా రానున్న రోజుల్లో వారికి ఉన్న ఏకైక ఆయుధం ఓటుతో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మెహిదీపట్నం, మే 5 : గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన లంగర్ హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లంగర్ హౌస్ లక్ష్మీ నగర్ రింగ్ రోడ్డు సమీపంలో ఫుట్ పాత్‌పై గుర్తు తెలియని వ్యక్తి చనిపోయి ఉండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. వివరాలకు 87126 60428 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## అన్నమయ్య సంకీర్తనల గాన మహాయజ్ఞం




అన్నమాచార్య సంకీర్తనలు చేస్తున్న కోటిపాటి వెంకటేశ్వర్లు

ముషీరాబాద్, మే 5: దక్షిణ భారత తొలి వాగ్గేయ కారుడు అన్నమాచార్య జయంతి సందర్భంగా త్యాగరాయ గానసభలో గురు వెంకటేశ్వర్లు, కోటపాటి గోవింద దాస స్వర రచనతో గాన మహా యజ్ఞం సోమవారం ఆరంభమైంది. ఎస్ఎస్ఎస్‌వీ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహణలో అనురాధ కోటపాటి పర్యవేక్షణలో తొలిరోజు జరిగిన గాన గోష్ఠిలో పలువురు ఆయన శిష్య బృందం గానం చేశారు. గోవింద దాస కడప రాయ సంకీర్తనలు మధుర గానం చేసి శ్రోతలను ముగ్ధలను చేశారు.

## తుకారంగేట్ పోలీసు అధికారులకు అభినందనలు



తుకారంగేట్ సీఐ, డీఐలను సన్మానిస్తున్న మాల మహా సంఘం ప్రతినిధులు

అడ్డగుట్ట, మే 5: తుకారంగేట్ సీఐగా, డీఐగా నూతనంగా బాధ్యతలను స్వీకరించిన శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనులను మాల మహా సంఘం ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన సలహాదారుడు నక్క మధు, ప్రతినిధులు ఆర్.మల్లేష్, జైకుమార్, కోటేశ్వరరావు, అమర్ బాన్సోడె, శివకుమార్, మహేందర్, రమేష్, రమాదేవి, ప్రసన్నలక్ష్మి, ఉమ, రమ పాల్గొన్నారు.

## ముషీరాబాద్ అభివృద్ధికే ఎంపీ నిధులు



ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్‌ను సన్మానించిన సయ్యద్ మసూద్, నాయకులు

కవాడిగూడ, మే 5: ముషీరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి తన ఎంపీ నిధులను కేటాయిస్తానని రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ తెలిపారు. భోలక్‌పూర్ డివిజన్ సిద్ధిక్‌నగర్ సందాని గల్లీలో నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి రూ.10.50లక్షలు తన ఎంపీ కోటా నుంచి నిధులను కేటాయించడాన్ని స్వాగతిస్తూ సోమవారం సయ్యద్ మసూద్ ఆధ్వర్యంలో ఎంపీని సన్మానించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు నిధులు కేటాయిస్తున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్, జఫీర్‌ఉద్దన్, ఉస్మాన్, వాహెద్, ఖరీం, అబ్దుల్, అలిబాబా, ఖైరత్, ముజిద్ తదితరులు పాల్గొన్నారు.

## వారాసిగూడ సీఐగా మధుసూదన్‌రెడ్డి



బాధ్యతలు స్వీకరించిన మధుసూదన్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ: వారాసిగూడ పోలీస్ స్టేషన్ సీఐ (స్టేషన్ హౌస్ ఆఫీసర్)గా అరకల మధుసూదన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన 2009 బ్యాచ్‌కు చెందిన అధికారి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తన ప్రథమ ప్రాధాన్యమని అన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

## బేగంపేట డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా జి.శ్రీనివాస్



బాధ్యతలు స్వీకరించిన జి.శ్రీనివాస్

బేగంపేట్: బేగంపేట పోలీసు స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా జి.శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల పోలీసు ఇన్‌స్పెక్టర్ల సాధారణ బదిలీల్లో భాగంగా బేగంపేట డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న మధుసూదన్‌రెడ్డిని వారాసిగూడ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో మధురానగర్‌లో పనిచేస్తున్న శ్రీనివాస్‌ను బేగంపేట డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా నియమిస్తూ పోలీసు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. 2009 బ్యాచ్‌కు చెందిన శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మాట్లాడుతూ పౌరులు, సిబ్బంది సహకారంతో నేరాల నియంత్రణకు కృషి చేస్తానన్నారు.

## సీతాశతకం పుస్తకావిష్కరణ

రవీంద్రభారతి, మే 5 : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, దర్పరణం సాహిత్య వేదిక, అశ్విని ప్రచురణల సంయుక్త ఆధ్వర్యంలో డా.చీదెళ్ల సీతాలక్ష్మి రచించిన కవితా దర్పరణం, కళారత్న శంకర నారాయణ రచించిన సీతాశతకం పుస్తకావిష్కరణ సోమవారం రవీంద్రభారతి సమావేశ మందిరంలో నిర్వహించారు. సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.నామోజు బాలాచారి ముఖ్యఅతిథిగా విచ్చేసి పుస్తకాలను ఆవిష్కరించారు. డా.రాయారావు సూర్యప్రకాశ్‌రావు సభాధ్యక్షత వహించిన కార్యక్రమంలో డాక్టర్ బాలాచారి మాట్లాడుతూ రచయితలు చాలా అద్భుతమైన పుస్తకాలను రచించారని ఆయన కొనియాడారు. దాస్యం సేననాధిపతి, రూపాదేవి, చెన్నూరి సీతారాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం



అరుణోదయ రామారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

ముషీరాబాద్, మే 5: మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడటమే అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపక సభ్యుడు, కామ్రేడ్ అరుణోదయ రామారావుకు నిజమైన నివాళి అని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.గోవర్ధన్ అన్నారు. రామారావు 6వ వర్ధంతి విద్యానగర్ మార్క్స్ భవన్‌లో సోమవారం జరిగింది. న్యూడెమోక్రసీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ అరుణోదయ రామారావు తన జీవితం చివరి శ్వాస వరకు ప్రజల కోసం పనిచేశారని, విప్లవోద్యమ సాంస్కృతిక ఉద్యమంలో ఎనలేని కృషి చేశారన్నారు. తెలుగు నేల మీద 'అరుణోదయ' పాట ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. అరుణోదయను స్థాపించడంలో రామారావుది కీలకపాత్ర అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా జాతీయస్థాయిలో ఐక్య సాంస్కృతిక రంగ వేదికను ఏర్పాటు చేయడం కోసం తీవ్రంగా కృషి చేశారన్నారు. నేడు మతోన్మాద బీజేపీ ప్రభుత్వం ప్రజల ఆటలు, పాటలు, మాటలపై ఫాసిస్ట్ చర్యలతో విరుచుకుపడుతుందన్నారు. రామారావు స్ఫూర్తితో మోదీ ఫాస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జాతీయ నాయకులు వి.సంధ్య, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఝాన్సీ, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనసూయ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, అరుణ, అనురాధ, పి.మహేష్, నాగరాజు, నవీన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఆసిఫ్, గౌతమ్, ఝాన్సీ, మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరానగర్‌లో ప్రమాదకరంగా రాళ్లు




ఇందిరానగర్ కాలనీలో ప్రధాన రోడ్డుపైనే ప్రమాదకరంగా గ్రానైట్ రాళ్లు

సికింద్రాబాద్, మే 5: జీహెచ్‌ఎంసీ అధికారులు, కాంట్రాక్టర్ల సమన్వయ లోపంతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. అయినా పట్టించుకునే వారే కరువయ్యారు. అభివృద్ధి పనులు జరిగి నెలలు గడుస్తున్నా నిర్మాణ మెటీరియల్‌ను తొలగించడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. దీంతో స్థానిక ప్రజలు ప్రమాదాల బారిన పడాల్సిన దుస్థితి నెలకొంది. ఈ సమస్యను స్థానికులు అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేకుండా పోతోందని స్థానికులు వాపోతున్నారు. వివరాలలోకి వెళ్తే.. సీతాఫల్‌మండి డివిజన్ ఇందిరానగర్ కాలనీలోని ప్రధాన రోడ్డు మీద గ్రానైట్ రాళ్లు ప్రమాదకరంగా మారాయి. కాలనీలో గతంలో నాలా నిర్మాణ పనులు జరిగాయి. రోజులు గడుస్తున్నా.. గ్రానైట్ రాళ్లు మాత్రం కుప్పలుగా మిగిలి పోయాయి. వాటిని ఎందుకు తొలగించడం లేదని స్థానికులు మండి పడుతున్నారు. ఇందిరానగర్ కాలనీ ప్రధాన దారిలో రోడ్ పైనే రాళ్లు ఉండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపైన వదిలేసిన గ్రానైట్ రాళ్లు ప్రమాదకరంగా మారడంతో పలువురు ప్రమాదాల పడిన సందర్భాలు ఉన్నాయని పేర్కొంటున్నారు. ఇక్కడున్న నాలా పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా.. సంబంధిత రాళ్లు రోడ్డుపైనే వదలడంతో సమస్యలు తప్పడం లేదని చెబుతున్నారు.. అనుకోకుండా ప్రమాద వాశాత్తు కింద పడితే గ్రానైట్ రాళ్లు తాకి ప్రాణాపాయం కలిగే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ప్రమాదం జరగక ముందే చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా స్థానికులు కోరుతున్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన కార్పొరేటర్



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

ఉస్మానియా యూనివర్సిటీ: బౌద్ధనగర్ డివిజన్లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ కంది శైలజ సోమవారం పరిశీలించారు. గొల్ల పుల్లయ్య బావి, నల్లపోచమ్మ ఆలయం వద్ద నూతనంగా నిర్మించబోయే సీసీ రోడ్డు పనులను డీఈ తిరుపతితో కలిసి పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అన్నారు.

## మానసిక ఆరోగ్యంపై మరింత అవగాహన అవసరం

బేగంపేట్, మే 5: మానసిక సమస్యల నివారణలో సైకాలజిస్టుల పాత్ర కీలకమని, మానసిక ఆరోగ్యం పట్ల ప్రజలకు మరింత అవగాహన కల్పించడం అవసరమని తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ అన్నారు. సికింద్రాబాద్ ప్యారడైజ్ లయన్స్ భవన్ హాల్లో సోమవారం అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. పలువురు సైకాలజిస్టులు మాట్లాడుతూ ఒత్తిడితో కూడిన జీవిత విధానంలో మానసిక ఆరోగ్యం కీలకంగా మారిందన్నారు. అనేక అంశాలు మనిషి మానసిక స్థితిని ప్రభావితం చేస్తున్నాయని అన్నారు. మానసిన ఆందోళన నివారణ కోసం తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సుధాకర్, ఉమర్‌ఖాన్, నారాయణరావు, శ్రీపూజ, ఆచార్య తదితరులు పాల్గొన్నారు.